


జోడేఘాట్ ముఖద్వారం

ఆదివాసీల గుండెచప్పుడు.. కుమరం భీం

- జల్.. జంగల్.. జమీన్ హక్కుల కోసం నిజాం సర్కారుపై సమరం
- నిజాం గుండెల్లో నిద్రపోయిన ధీరుడు
- 1940కి ముందే తుపాకీ పట్టిన గోండు వీరుడు
- నేడు కుమరం భీం 84వ వర్ధంతి

ఆసిఫాబాద్/కెరమెరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల కోసం నైజాంకు వ్యతిరేకంగా సమరభేరి మోగించిన యోధుడు.. నిజాం నిరంకుశ పాలనలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపై ఎలుగెత్తిన వీరుడు.. జల్.. జంగల్.. జమీన్(భూమి, నీరు, అడవి) కోసం చేసిన పోరాటంలో అమరుడై గిరిజనుల ఆరాధ్య దైవమయ్యాడు కుమరం భీం. ఓ పక్క దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటం మహోద్యమంగా కొనసాగుతుంటే.. మరోపక్క తెలంగాణలో నిజాం నిరంకుశత్వం.. రజాకార్ల ఆగడాలపై తిరుగుబాట్లు జరుగుతున్న రోజులవి. ఈ రెండు ఉద్యమాలకు సమాంతరంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో కుమరం భీం నాయకత్వంలో గిరిజనుల స్వాతంత్ర్య పోరాటం కొనసాగింది.

ఆదివాసీ బిడ్డలపై అమానుష నిర్బంధానికి వ్యతిరేకంగా నిజాం సర్కార్‌పై జల్ జంగల్ జమీన్ నినాదంతో జంగు సైరన్ ఊదిన ఆదివాసీ నిప్పుకణిక కుమరంభీం ఈలోకాన్ని విడిచి నేటికి సరిగ్గా 84 వసంతాలు పూర్తయ్యాయి. అడవిబిడ్డల ఆత్మస్థైర్యాన్ని శిఖరస్థాయికి చేర్చి తను కనుమరుగైపోయినా తను నింపిన స్ఫూర్తిని, ధైర్యాన్ని అడవిబిడ్డలు నేటికీ తలుచుకుంటూనే ఉన్నారు. ప్రతి యేటా ఆశ్వయుజపౌర్ణమి రోజున ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు.

శిస్తు(పన్నులు) పేరుతో ఆదివాసీలపై నిజాం అనుచరులు చేస్తున్న ఆగడాలను సహించలేక సాయుధపోరే సమస్యకు పరిష్కారమని నమ్మి 1940కి ముందే జోడేఘాట్ పోరాటగడ్డపై తుపాకీ ఎక్కుపెట్టాడు. తనదైన గెరిల్లా వ్యూహాలతో నిజాం సైన్యాన్ని ముప్పు తిప్పలు పెట్టి నైజాం అల్లూరిగా నిజాం గుండెల్లో నిద్ర పోయాడు. నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటం చేయకముందే జిల్లాలో కుమరం భీం తుపాకీ చేత పట్టి ఉద్యమానికి సిద్ధమయ్యాడు. భీం పోరాట స్ఫూర్తితోనే 1948లో నిజాం ప్రభువుపై భారత ప్రభుత్వం జరిపిన సైనిక చర్యకు మద్దతుగా రజాకార్లతో ఎంతోమంది యువకులు సాయుధ పోరాటానికి దిగారు. జాగీరుదారుల అణచివేత, అత్యాచారాలు, ఆగడాలను తట్టుకోలేక తనతో కలిసి పెరిగిన అడవిబిడ్డలనే అనుచరులుగా మార్చుకుని వారికి సాయుధ శిక్షణ ఇవ్వడం ద్వారా నిజాం సైనికులను ఓడించినంత పనిచేశారు. అడవిలో పుట్టిన గిరిజనులు ప్రకృతి సంపదను అనుభవించకుండా దోపిడీ చేస్తున్న దళారీలు, వ్యాపారులు, అటవీ అధికారుల వ్యవస్థకు నిరసనగా ఎదురు తిరిగి అడవిలో కట్టెలు కొట్టకూడదని, పశువులు మేపకూడదని, భూములు దున్నకూడదని నిజాం ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని భీం సవాలు చేయడమే కాకుండా వారి ఆదేశాలను ధిక్కరించాడు.

అనుచరుడి సమాచారంతో...

కుమరంభీం అనుచరుడైన మడావి కొద్దు అనే వ్యక్తి 1940అక్టోబర్ 6న ఇచ్చిన సమాచారం మేరకు నిజాం ప్రభుత్వం అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల సహకారంతో పెద్దఎత్తున సైనికులను మోహరించి భీం సైన్యం కోసం గాలింపులు చేపట్టింది. అర్ధరాత్రి భీంపై నిజాం పోలీసులు ఆకస్మిక దాడితో చుట్టుముట్టి గుండ్ల వర్షం కురిపించారు. నిజాం పోలీసులను వీరోచితంగా ఎదుర్కొని చివరకు మృత్యుదేవత ఒడిలో తుదిశ్వాస విడిచారు. భీం నిజాం సైన్యం కాల్పుల్లో మరణించడంతో ఆయన అనుచరులు చెల్లాచెదురయ్యారు.

గెరిల్లా దళం ఏర్పాటు..


ఆదివాసీ గిరిజన హక్కుల కోసం పోరాడేందుకు ఒక్కో కుటుంబం నుంచి ఒక్కో గిరిజన యువకుడిని చేరదీసి సైన్యాన్ని ఏర్పాటు చేశాడు కుమరం భీం. ఉచ్చులు పెట్టడం, గెరిల్లా దాడులపై శిక్షణ ఇచ్చాడు. బర్మారా (ఒకరకమైన నాటు తుపాకులు) ఇంటికోటి ఉండాలని చెప్పేవాడు.


చిన్నతనం నుంచే తిరుగుబాటు..

భీం స్వగ్రామం ఆసిఫాబాద్ మండలం సంకెపల్లి గ్రామం. భీం బాల్యంలో ఉండగానే తండ్రి మరణించడంతో పదిహేనవ యేటా కుటుంబ, గ్రామపెద్దగా బాధ్యతలు చేపట్టాడు. నిజాం పోలీసుల, అటవీ అధికారుల ఆగడాలను సహించలేకపోయాడు. తన చిన్నతనంలో ఆదివాసీలు అటవీశాఖ సిబ్బందితో పడుతున్న గొడవలకు కారణాలను తెలుసుకున్నాడు. వారిని ఎదురించడం ప్రారంభించాడు.

అధికారికంగా వర్ధంతి కార్యక్రమాలు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటిసారిగా 2014లో కుమరంభీం 74వ వర్ధంతి కార్యక్రమాన్ని అప్పటి ప్రభుత్వం అధికారికంగా చేపట్టగా ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా జోడేఘాట్‌కు మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు హాజరయ్యారు. దీంతో ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా జోడేఘాట్‌కు వచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. వర్ధంతి సందర్భంగా నిర్వహించిన దర్బార్‌లో రూ.25కోట్లను మంజూరు చేసి జోడేఘాట్‌ను పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దారు. గురువారం భీం 84వ వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేసారు. కుమరం భీం 84వ వర్ధంతి కార్యక్రమాన్ని మంత్రి సీతక్క, ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, హరీష్‌బాబు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుతోపాటు ఆదివాసీ సంఘాల నాయకులు హాజరుకానున్నారు


జోడేఘాట్ గ్రామం


జోడేఘాట్‌లోని స్మృతి వనం

పోడు రైతులను వేధించడం సరికాదు


పోడురైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కడంబా అటవీప్రాంతంలో ఉన్నపోడురైతులను అటవీశాఖఅధికారులు వేధించటం సరికాదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కాగజ్‌నగర్‌మండలం కడంబాలో పోడురైతులను కలిశారు. ఈ సందర్భంగా పలువురు పోడురైతులు మాట్లాడుతూ తాము పోడువ్యవసాయంలో భాగంగా కందిపంట వేసినట్టు వివరించారు. అటవీశాఖ అధికారులు రెండ్రోజుల క్రితం వచ్చి పంటను పీకేసినట్టు తెలిపారు. దీంతో తమకు తీవ్రనష్టం జరిగిందని తెలిపారు. అనంతరం అక్కడి నుంచే నేరుగా అటవీశాఖ ఉన్నతాధికారుతో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఈ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని తెలిపారు.కార్యక్ర మంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, రాజ్‌కుమార్ యాదవ్, నక్క మనోహర్, రాంప్రసాద్, మహ్మద్‌మినాజ్,దేవాజీ,విగ్నేశ్వర్‌కార్యకర్తలున్నారు.

విధుల్లో చేరిన 35మంది ఉపాధ్యాయులు


విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు

సిర్పూరు(టి), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా ఎన్నికైన 35 మంది ఉపాధ్యాయులు బుధవారం ఆయా కాంప్లెక్సు స్కూళ్లలో జాయినింగ్ అయ్యారు. మండలకేంద్రంలోని సిర్పూరు(టి)కాంప్లెక్సులో 20మంది, లోన్‌వెల్లిలో7, వేంపల్లిలో 8జాయినింగ్ అయినట్టు కాంప్లెక్స్ పీఆర్పీలు పవన్‌కుమార్, రాజేష్, రమేష్‌తెలిపారు. సిర్పూరు(టి) మండలంలోని ఉపాధ్యాయులు కొరతలేకుండాపోయింది. ఉపాధ్యాయులు చేరికపై ఆయాపాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పంటల వివరాల నమోదు

కౌటాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం పంటల వివరాలనమోదు కార్యక్రమాన్నివ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గుడ్లబోరిలోని సర్వేనెంబరు 15లో చేపట్టారు. ఈ సందర్భంగా పంట వివరాలను ఆన్‌లైన్‌లో ఫొటోలతో అప్‌లోడ్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆన్‌లైన్ నమోదు పంటలు రైతులు అమ్ముకునే సమయంలో ఉపయోగపడుతుందన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా నాగరాజు

బెజ్జూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల నూతన వ్యవసాయ అధికారులను నియమించడంతో వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

వాంకిడి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాల, ఉన్నతపాఠశాల, ఆదర్శ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచనపోటీలు నిర్వహించారు. సెల్‌ఫోన్‌ల వాడకంవల్ల కలిగే అనర్థాలు, మత్తురహిత తెలంగాణగా మారుస్తాం అనేఅంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏఎస్సై పోషెట్టి, ఎస్ఎస్ఎస్ పీవో చంద్రయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పర్యవేక్షించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల21 పోలీసు సంస్మరణ దినోత్సవం రోజున ప్రశంసాపత్రాలు అందించనున్నట్లు ఏఎస్సై పోషెట్టి తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


కౌటాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చిర్రకుంటగ్రామంలో పశువులకు ఉచితగాలికుంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశువైద్యాధికారి సురేష్, మాజీఎంపీపీ మల్లిఖార్జున్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 550 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమం నవంబరు15 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మురళీకృష్ణ, సిబ్బంది మోతీరాం, వినోద్, ప్రశాంత్, గజానంద్, నాగర్జున పాల్గొన్నారు.

కౌటాల: పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం కౌటాలలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధినివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలు నెల రోజుల పాటు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పశువులు యాజమానులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, సిబ్బంది సత్యనారాయణ, శోభన్, భిక్షపతి, ప్రకాష్, సందీప్, రైతులు పాల్గొన్నారు.

కౌటాల ఏఈగా ప్రేమ్‌కుమార్


ఏఈని సన్మానిస్తున్న సిబ్బంది

కౌటాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కౌటాల విద్యుత్ శాఖ ఏఈగా వాంఖడే ప్రేమ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఈగా పనిచేసిన రవీందర్ బదిలీపై తిర్యాణి మండలానికి వెళ్లారు. ఆసిఫాబాద్‌లో పనిచేసిన ప్రేమ్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీచేశారు. అలాగే ఫోర్‌మెన్ నర్సింగరావు కూడా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు మాధవ్, ప్రవీణ్, లైన్‌మెన్ చరణ్‌దాస్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన జేకే యాజమాన్యం

కాగజ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): లారీ అసోసియేషన్ సభ్యులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు అసోసియేషన్‌కు సంబంధించిన 33లారీల లోడ్‌లను ఇతరరాష్ట్రాలకు పంపించకుండా సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై జేకే యాజమాన్యం నాలుగురోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించింది. 33లోడ్ లారీలను నిలిపేశారని దీంతో తీవ్రనష్టం వాటిల్లుతోందని తమకు న్యాయం చేయాలని యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించగా ఈ మేరకు ఇంటిరియం ఆర్డర్ ఇచ్చినట్టు తెలిసింది. 20రోజులుగా జేకే యాజమాన్యం, లారీ అసోసియేషన్ మధ్య వివాదం కొనసాగుతోంది. పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదు. లారీ అసోసియేషన్ సభ్యులు తమ కుటుంబసభ్యులతో ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. జేకే యాజమాన్యం మాత్రం తాము అదనపు పాయింట్లు పెంచలేమని పేర్కొనటం, లారీ అసోసియేషన్ సభ్యులు తమకు ఖచ్చితంగా లోడింగ్ పాయింట్లను పెంచాలని పట్టుబట్టి పోరాటాలు చేస్తున్నారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి: మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్/ ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖమంత్రి సీతక్క అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంతోపాటు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుండిగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పదవతరగతి అప్‌గ్రేడ్‌చేసిన పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. గుండి వంతెన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గుండి నుంచి ఖనర్‌గాం వరకు రహదారి నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని మాజీఎంపీటీసీ రవిందర్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే ఇందిర మహిళ శక్తి క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వైద్యఆరోగ్యశాఖ మంత్రి, వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శి దృష్టికితీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్ల, డీసీసీఅధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, పీఏసీఎస్‌చైర్మన్ అలీబీన్‌అహ్మద్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీమార్కెట్ కమిటీచైర్మన్ గాదవేణి మల్లేష్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చరణ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు అబ్దుల్లా, మునీర్, షెండె దత్తు, చిట్ల నారాయణ, అసద్, సలీం, కలీం, గోపాల్‌నాయక్, వసంత్‌రావు, దీపక్, శ్యాం, కళావతి తదితరులు పాల్గొన్నారు.

నడుచుకుంటూ వాగు దాటిన మంత్రి..

మండలంలోని గుండిగ్రామంలో పాఠశాల అప్‌గ్రేడ్ కార్యక్రమానికి వచ్చిన మంత్రి గ్రామానికి వెళ్లేటపుడు ఫారెస్టు జీపులలో గ్రామానికి చేరుకున్నారు. కార్యక్రమాన్ని ముగించుకొని తిరుగు ప్రయాణంలో వాగువద్దకు చేరుకున్న ఆమె వాహనం నుంచి దిగి నడుచుకుంటూ వాగు దాటారు. మంత్రిని అనుసరిస్తూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ, ఇతర అధికారులు, నాయకులు సైతం నడుచుకుంటూ వాగు దాటారు.

మంత్రిచే పలు ప్రారంభోత్సవాలు..

అనంతరం బీహెచ్‌ఈఎల్ సౌజన్యంతో జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సంచారసైన్స్‌ల్యాబ్ బస్సును ప్రారంభించారు. కలెక్టరేట్, జిల్లా ప్రభుత్వఆసుపత్రిలలో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లను ఆమె ప్రారంభించారు. అడగ్రామంలోని కుమరంభీం ప్రాజెక్టువద్ద టూరిజంశాఖ ఆధ్వర్యంలో రూ.80 లక్షలతో నిర్మిం చిన అతిథిగృహన్ని ఆమె ప్రారంభించారు. ప్రాజెక్టులోకి చేపపిల్లలను విడుదల చేశారు.

అనంతరం వట్టివాగు ప్రాజె క్టువద్ద కట్ట బలోపేతానికి నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. 270స్వయం సహాయక సంఘాలకు రూ.18కోట్ల స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. పీఎం జన్‌ధన్ పథకం కింద మంజూరైన ఆరు వాహనాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు ఆయాసంఘాల నాయకులు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. అలాగే ఆసిఫాబాద్ మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు స్వరూప, బీసీ సంక్షేమ సంఘం నాయకులు డాక్టర్ రమేష్, మారుతిపటేల్ మంత్రిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.


మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క


కాలినడకన గుండి వాగు దాటుతున్న మంత్రి సీతక్క తదితరులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రైవేటు జూనియర్, డిగ్రీకళాశాలలకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో ప్రైవేటుకళాశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులు శాంతియుత ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ చైతన్య, మాతృశ్రీకళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాల నిర్వహణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వంనిధులువిడుదల చేయకుంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రైవేటుకళాశాలల ప్రతినిధులు రాజశేఖర్, శ్రీనివాస్, ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీలకు జిల్లావిద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సట్ల శంకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఈనెల 16నుంచి 19వరకు జరుగనున్న జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో ఆసిఫాబాద్ ఆదర్శ క్రీడాపాఠశాల విద్యార్థిని అలం శైలజ, సిర్పూర్ పాఠశాలకు చెందిన రత్నం వంశీ ఎంపికయ్యారని అన్నారు. వీరు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు.

కొనసాగుతున్న రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు


పూర్తి అయిన షెడ్డు నిర్మాణం


తుది దశకు చేరుకున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం



కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్

పూర్తయిన రెండు షెడ్లు

తుది దశకు చేరుకున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

కాగజ్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాగజ్‌గర్ రైల్వేస్టేషన్‌లో సుందరీకరణపనులుజరుగుతున్నాయి. బల్లార్షా-కాగజ్‌నగర్ వరకు మూడోట్రాక్ పనులు పూర్తి కావటంతో ఇక రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రప్రభుత్వం దృష్టిసారించింది. ప్లాట్‌ఫాం నిర్మా ణం, నాలుగు షెడ్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు గతేడాది రూ.1.50 కోట్ల నిధులు విడుదల చేసింది. టెండరు ప్రక్రియను పూర్తి చేసుకొని పనులను ఆరు నెలల క్రితం ప్రారంభించారు. ఇప్పటివరకు ప్లాట్‌ఫాం నిర్మాణం పూర్తి అయింది. అలాగే రెండుషెడ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉండగా, స్టేషన్ సుందీకరణలో భాగంగా మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కూడా తుది దశకు వచ్చింది. అభివృద్ధి పనులు జరుగుతుండటం పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సుందరీకరణలో భాగంగా స్టేషన్ గోడలకు రంగులు వేశారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టు కోసం ఎదురుచూపులు..

నిత్యం గూడ్స్, ప్యాసింజర్స్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు దాదాపు 200వరకు అప్, డౌన్ వెళ్లుతుంటాయి. మూడోట్రాక్ క్లియర్ కావటంత వందేభారత్ రైలు కూడా నాగ్‌పూర్-సికింద్రాబాద్ వరకు గతనెల ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగజ్‌నగర్‌లో వందేభారత్ హాల్టు చేయాలని ఎమ్మెల్యేహరీష్‌బాబు, ఎంపీ గోడం నగేష్ రైల్వే అధికారులకువినతి పత్రాలు కూడా సమర్పించారు. కేరళ, తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా హాల్టు ఇవ్వాలని కోరుతున్నారు. కాగజ్‌నగర్ పారిశ్రామిక కారిడార్ కావటంతో నిత్యం ఢిల్లీ, హైదరాబాద్, గుజరాత్, ఇతర ప్రాంతాల నుంచి మిల్లు కోసం ఇక్కడికి వస్తుంటారు. అలాగే టికెట్ బుకింగ్ కూడా అధికంగా జరుగుతండగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరుతున్నారు.

చాలా సంతోషంగా ఉంది..

లెండుగురే శ్యాం రావు, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో సుందరీకరణ పనులు జరుగుతుండటం హర్షణీయం. వీటితోపాటు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేస్తే బాగుటుంది. ప్రయాణికులకు ఇబ్బంది తలెత్తకుండా ఉంటుంది. అలాగే వందేభారత్ రైలుతో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా కాగజ్‌నగర్‌లో హాల్టు చేయాలి.

పశువులకు టీకా

కాసిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కేపల్లి గ్రామంలో బుధవారం 150 ఆవులు, 300 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యాధికారిణి సరిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి నవంబర్ 14 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాను ఉచితంగా వేయనున్నామని చెప్పారు. పశువుల యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కారక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో హెటిరోసంస్థ ఆధ్వర్యంలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్‌సహకారంతో బుధవార ఇంటర్మీడియట్ పూర్తిచేసిన యువతకు ఉద్యోగ కల్పనకు జాబ్‌మేళా నిర్వహించారు. కంపెనీ ప్రతినిదులు పరీక్షద్వారా 14మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి హెటిరో సంస్థ ఉద్యోగంతోపాటు ఉచితడిగ్రీ, వసతి కల్పించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని జాఫర్‌నగర్‌కు చెందిన తౌటం వీరజ్ హిమాలయ పర్వతారోహణ చేయగా బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యతో పాటు పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో విద్యనభ్యసిస్తున్న వీరజ్ కోచ్ మహిపాల్ రెడ్డి సారథ్యంలో 47 మందితో కలిసి అక్టోబరు 2 నుంచి 5వరకు 4250 మీటర్లు పర్వతారోహణ చేశాడని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారు తీప్రసాద్, ఇంజనీర్ మసూద్ అలీ, కౌన్సిలర్ పోరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

భీం వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి

- చకచకా దర్బార్ వేదిక ఏర్పాటు
- బుధవారం రాత్రి ప్రారంభం అయిన అవ్వల్ పేన్ పూజ
- జోడేఘాట్‌కు హట్టి నుంచి ఉచిత రవాణా సదుపాయం
- హాజరయ్యే ప్రజలకు భోజన, మంచినీటి సదుపాయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

కెరమెరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కుమరం భీం 84వ వర్ధంతిని పురస్కరించుకుని జోడేఘాట్‌లోని కుమరం భీం స్మారక ప్రాంగణంలో ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. బుధవారం రాత్రి లాంచనంగా ప్రారంభం అయిన అవ్వల్ పేన్ పూజలతో వర్ధంతి వేడుకలు ప్రారంభం అయ్యాయి. గురువారం జరగనున్న పూజా కార్యక్రమాలు, నివాళులు అర్పించడం తరువాత జెండావిష్కరణ, ప్రజాదర్బార్ కార్యక్రమాల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, కలెక్టర్ వెంకటేష్‌దోత్రేతో కలిసి పనులను పర్యవేక్షించారు. ఇప్పటికే పలు దఫాలుగా ఉత్సవ కమిటీతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం నుంచే జోడేఘాట్‌లో షామియానాల ఏర్పాట్లు ప్రారంభించి బుధవారం సాయంత్రం వరకు పూర్తి చేశారు. గురువారం హాజరయ్యే గిరిజనులకు, అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జోడేఘాట్‌లో భోజనం, మంచినీరు ఏర్పాట్లు చేస్తున్నారు. హట్టి నుంచి ప్రత్యేక రవాణా ఏర్పాట్లు కల్పించడంతోపాటు ఉట్నూర్, ఆసిఫాబాద్ డిపోలనుంచి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. వీఐపీలు, అధికారుల కోసం స్మారక ప్రాంగణం సమీపంలో భోజన ఏర్పాట్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు స్మారకస్థూపం, హంపీ థియేటర్, మ్యూజియంల వద్ద మరమ్మతులు చేపట్టారు. జోడేఘాట్ నుంచి హట్టి వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల పొదలను తొలగిరచారు. కల్వర్టుల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు.

పెర్సాపేన్ పూజతో వేడుకలు ప్రారంభం

భీం వర్ధంతి సందర్భంగా ఒక్క రోజు ముందుకు నిర్వహించే పెర్సాపేన్, అవ్వల్‌పేన్ పూజా కార్యక్రమాలను భీం వారసులతో పాటు కుమరం వంశీయులు ఘనంగా చేపట్టారు. ప్రతియేటా పెర్సాపేన్, అవ్వల్ పేన్ పూజల నిర్వహించిన అనంతరం భీం వర్ధంతి వేడుకలు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. బుధవారం రాత్రి భీం మనుమడు సోనేరావుతోపాటు కుటుంబసభ్యులు, వారసులు, బంధువులు, కుమరం వంశీయులు పెద్దసంఖ్యలో జోడేఘాట్‌కు చేరుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

హాజరు కానున్న ప్రముఖులు..

భీం వర్ధంతి సందర్భంగా గురువారం నిర్వహించే దర్బార్ కార్యక్రమంలో మంత్రిసీతక్కతోపాటు ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్, ఆసిఫాబాద్, సిర్పూర్, మంచిర్యాల, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్ ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, కొక్కిరాల ప్రేంసాగర్ రావు, వెడ్మబొజ్జు, పాయల్ శంకర్, అనిల్‌జాదవ్, మహేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నారు. అలాగే ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, వేణు, జిల్లా అధికార యంత్రాంగం హాజరుకానున్నారు.

భారీ పోలీసు బందోబస్తు..

భీం వర్ధంతిని పురస్కరించుకొని జోడేఘాట్‌లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం కెరమెరి మండల కేంద్రంలోని స్టార్‌ఫంక్షన్ హాలులో బందోబస్తు నిర్వహణపై ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు సమావేశం నిర్వహించి పోలీసు అధికారులకు బందోబస్తుపై దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు హట్టి నుంచి జోడేఘాట్ వరకు బాంబు డిస్పోసల్ టీం తనిఖీలు నిర్వహించింది. ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీలు కరుణాకర్, రామనుజంతో పాటు 15మంది సీఐలు, 20మంది ఎస్సైలు, మొత్తం 460మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు.


జోడేఘాట్‌లో ఏర్పాటు చేసిన షామియానాలు

క్రైం కార్నర్

హత్య కేసులో 16మందికి జీవిత ఖైదు

రెబ్బెన, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం సింగిల్‌గూడ గ్రామానికి చెందిన అజ్మీర రమేష్ హత్యకేసులో 16మందికి జీవిత ఖైదుతోపాటు రూ.1.49లక్షలజరిమానావిధిస్తూ ఆసిఫాబాద్ సెషన్‌కోర్టు ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్ బుధవారం తీర్పును వెలువరించారు. మృతుడు రమేష్ భార్య అజ్మీరరేణుక ఫిర్యాదు ప్రకారం.. రమేష్ సోదరి రాజేశ్వరి తేది19.08.2020న తనఇంటికి తిరిగివస్తుండగా మార్గమధ్యలో జర్పుల సురేష్ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కేకలు వేయగా కొద్దిదూరంలో ఉన్న అజ్మీర రమేష్ అతని కుమారుడు లోకేష్ ఇంటి నుంచి బయటికి వచ్చారు. దీంతో జర్పుల సురేష్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈఘటన జరిగిన కొద్దిసేపటి తర్వాత బయటికి వెళ్లిన రమేష్ తన ఇంటికి వస్తున్న క్రమంలో జర్పుల సురేష్‌తోపాటు మరో 15మంది వెంటతెచ్చుకున్న గొడ్డలితో రమేష్ తల, నుదిటిపై నరికారు. అక్కడికి వచ్చిన రాజేశ్వరి, ఆమె చెల్లెలు రేణుకను కర్రలతో గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ హత్యపై ఎస్సైడి రమేష్ కేసు నమోదు చేశారు. ఎ-1గా జర్పుల సురేష్, ఎ-2గా సత్యవతి, ఎ-3గా అజ్మీర వసంత్‌రావు, ఎ-4గా జర్పుల బిక్యానాయక్‌తోపాటు జర్పుల హరీష్, అజ్మీర అరవింద్, నవీన్, ప్రవీణ్, సంతోష్, అజ్మీర ప్రవీణ్‌కుమార్, జర్పుల లక్ష్మి, రజిత, తుకారం, రవి, రాజు, జర్పుల బిక్యానాయక్‌ను అరెస్టు చేసి కోర్టుకు పంపించారు. ఈ కేసులో ఆసిఫాబాద్ కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, ఏఎస్సై ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుళ్లు ఉమేష్ నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా ఆసిఫాబాద్ సెషన్‌కోర్టు ప్రధానన్యాయాధికారి ఎంవీరమేష్ 16మందికి జీవిత ఖైదుతోపాటు రూ.1.49లక్షలజరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ తరుపున జగన్‌మోహన్‌రావు వాదించి నేరం రుజువు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన బెల్లంపల్లిమండలంలోని దుబ్బపల్లి గ్రామానికిచెందిన మంచాల మహేష్(28) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మహేష్ అతిగా మద్యం సేవిస్తుండేవాడు. కుటుంబ సభ్యులు ఎక్కడ మందలిస్తారో అనే భయంతో సోమవారం పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన సింగతి నరేందర్ అనే వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేశ్ బుధవారం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన సింగతి మల్లేష్, మల్లేష్ కొడుకు సింగతి ఉమాకర్, మల్లేష్ భార్య సింగతి అంజక్కలు మంగళవారం గొడ్డళ్లతో నరేందర్‌పై దాడి చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిందితులకు రిమాండ్

కన్నెపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తితగాదాలతో గోమాస నరేందర్‌ను గొడ్డలితో కొట్టి చంపిన అత్తామామలు గోలేటి శంకర్, గోలేటి లక్ష్మి, నరేందర్ భార్య గోమాస భవానీ అలియాస్ బేబిని అరెస్టు చేసి బుధవారంకోర్టులో హాజరుపర్చినట్లు తాండూర్‌సీఐ కుమారస్వామి తెలిపారు. నిందితులను బెల్లంపల్లి కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ నిందితులకు 14రోజులపాటు రిమాండ్ విధించారని చెప్పారు. ఈ కేసులో ఇంకా ఎవరికైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జోడేఘాట్‌కు తరలిన కుమరం భీం కుటుంబ సభ్యులు


జోడేఘాట్ వెళ్తున్న కుమరం భీం వారసులు

సిర్పూర్(యు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదొబ్బ నుంచి కుమరం భీం కుటుంబసభ్యులు జోడేఘాట్‌కు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో కుమరంభీందంపతుల విగ్రహానికి వారు ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. జోడేఘట్‌లో గురువారం నిర్వహించే కుమరంభీం వర్ధంతిని జరుపుకోవ డానికి గ్రామస్థులు, ఆదివాసీలు, బంధువులు తరలివెళ్లారు.

కుమరం భీం వర్ధంతిని విజయవంతం చేయాలి


బెజ్జూరులో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు

బెజ్జూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కుమరం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసీసంఘం నాయకులు కోరారు. బుధవారం మండలకేంద్రంలో వారు మాట్లాడారు. భీం వర్ధంతిని గ్రామగ్రామాన ఘనంగా జరుపుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీసంఘం నాయకులు సిడాం సకారాం, కోర్తే తిరుపతి, బానయ్య, దేవాజి, మల్లేష్, గణేష్, పెద్దల శంకర్, మహిళా నాయకులు పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాండూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ గ్రామపంచాయతీలో పోచమ్మ కుంట శిఖం భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు సిరంగి శంకర్, డాక్టర్ శంకర్, ముష్కె సాగర్, సింగారం రఘు, శ్రీధర్‌లు బుధవారం మండల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతి పత్రం అందించారు. భూమిని కబ్జా చేసి ఫెన్సింగ్ వేశారని, దీంతో దహన సంస్కారాలు చేయడానికి వీలు లేకుండా పోయిందన్నారు. వెంటనే కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి గాను విదేశాల్లో విద్యనభ్యసించే వారికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిది పథకం కోసం అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామని జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ పాస్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29 వరకు గడువు ఉందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గం

జన్నారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని బుధవారం గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, సలహాదారుడు రాజమొగిలి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుమల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పారపు శేఖర్, కోశాధికారిగా తోట చంద్రశేఖర్ ఎన్నికయాయరు. ఉపాధ్యక్షులుగా వసంత్, ఉప కార్యదర్శులుగా మహేష్, సాయి, ప్రచార కార్యదర్శులుగా చారి, వినోద్, సలహాదారులుగా అంజన్న, వేణులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలని సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం, యాజమాన్యం చొరవ చూపాలని హెచ్‌ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో మాటాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు కీలకపాత్ర పోషించారన్నారు. సకల జనుల సమ్మెతో బొగ్గు పెల్ల కూడా బయటకు రాలేదని, దేశం అంధాకరంలోకి కూరుకు పోయిందని, దీంతో కేంద్రం స్పందించి రాష్ట్రం ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతను గనులను ఏర్పాటు చేయకుండా మోసం చేసిం దన్నారు. సింగరేణికి ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాల న్నారు. ప్రనాళిక లేకుండా ఏర్పాటు చేసిన ఓసీపీలు మూసివేతకు దగ్గర పడుతున్నాయన్నారు. దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. సింగరేణికి నాలుగు బొగ్గు బ్లాకులను కేటాయిం చాలన్నారు. శ్రావణపల్లి, కేకే6 గనులను త్వరగా ప్రారం భించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, రామస్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

పర్సనల్ విభాగం అధికారుల సేవాభావం

- విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత


విద్యార్థులకు స్టేషనరీని అందిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ విభాగం అధికారులు సేవాభావంతో ముందుకు వచ్చి పేదవిద్యార్థులకు సామగ్రి అందజేశారు. సింగరేణి ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేదవిద్యార్థుల కోసం పర్సనల్‌విభాగం అధికారులు 10వేల రూపాయల విలువగల పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు కొనుగోలు చేశారు. వాటిని జీఎం కార్యాలయంలో జీఎం బి సంజీవరెడ్డి చేతులమీదుగా బుధవారం విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా తనవంతుగా 5వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం ఎస్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, అధికారులు రాజేశ్వర్, రాజేశ్వర రావు, రాజేష్, దేవేందర్ రెడ్డి, పి కాంతారావు, సింగరేణి పాఠశాల హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి, పీఈటీ హేమ, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల హక్కుల సాధనలో రాజీపడేది లేదు'

మందమర్రిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ప్రగతి కోసం నిరంతరం పాటుపడుతున్న ఉద్యోగుల హక్కుల సాధన కోసం రాజీపడే ప్రసక్తే లేదని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియాఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. బుధవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏరియా వర్క్‌షాపు నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గుర్తింపు సంఘం వైఫల్యాలను ఎండగగడుతూ అన్ని ఏరియాల్లో యూనియన్‌ను బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, సూర్యనారాయణ, లక్ష్మణ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలి'

శ్రీరాంపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలోని ఓబీ కంపెనీల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు వెంటనే బోనస్ చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. జీవీఆర్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణికి వచ్చిన లాభాల వాటా నుంచి ఐదువేల రూపాయలు కాంట్రాక్టుకార్మికులకు బోనస్‌గా ఇస్తామని యాజమాన్యం ప్రకటించిందన్నారు. కానీ కొంతమందికి ఇచ్చి, మరికొంతమందికి చెల్లించకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు.

అంతేకాకుండా జీవీఆర్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో కొంత మందికి పీఎఫ్ మినహాయిస్తూ మరికొంత మందికి ఇవ్వకపోవడం సరికాదని ఆయన ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను శ్రీరాంపూర్ జీఎంతో పాటు సీఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నస్పూర్ పట్టణప్రధాన కార్యదర్శి కుర్రె చక్రవర్తి, నాయకులు ఈర్ల సదానందం, అగ్గు మల్లేష్, అశ్విన్ రెడ్డి, బింగి ప్రవీణ్, సుజిత్, విక్రమ్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై సింగరేణి ప్రత్యేక దృష్టి

మందమర్రి టౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమేలక్ష్యంగా సింగరేణి విస్తరించిన కొన్నిఏరియాల్లో యాజమాన్యం స్కిల్‌డెవలప్మెంట్ సెంటర్లు కొనసాగిస్తున్నారు. కొద్దినెలల క్రితం మందమర్రి ఏరియాలో ఈసెంటర్‌ను ఏర్పాటుచేయగా సీఎండీ బలరాంతోపాటు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ప్రారంభించారు. ఇప్పటి వరకు ఇక్కడ మూడునెలలుపాటు శిక్షణ అందించారు. ప్రస్తుతంమందమర్రిలో కంప్యూటర్ ఉచితశిక్షణ కోర్సులను ప్రవేశపెట్టారు. ఉపాధి లేనివారికి ఇవిఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు పేర్కొంటున్నారు. మిగితాఏరియాల్లోకూడా ఈకేంద్రాలను ఏర్పాటుచేస్తామని యాజమాన్యం పేర్కొంటోంది.

ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్, మందమర్రిఏరియాలకు చెందిన భూగర్భ గనుల నుంచి ఉపరితల గనులకు వెళ్లేందుకు బుధవారంఅధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీరాంపూర్ వృత్తిశిక్షణ కేంద్రంలో కౌన్సెలింగ్‌జరుగగా, 71మంది ఓవర్‌మెన్లు, హెడ్‌ఓవర్‌మెన్లు హాజరయ్యారు. ఇందులో 42మందిఉద్యోగులకు ఆప్షన్లు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం ఎస్ సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్)పి అరవింద రావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, వీటీసీ మేనేజర్ కల్లూరి వెంకటరామారావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ లక్కాకులశ్రీధర్ పాల్గొన్నారు.

లాభాల వాటా అందరికీ చెల్లించాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ లాభాలవాటా చెల్లించేలా చర్యలు చేపట్టాలని బుధవారం ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్టు కార్మికసంఘం నాయకులు ఎస్‌ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, బెల్లంపల్లి రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, జాఫర్ మాట్లాడుతూ కొంతమంది కాంట్రాక్టు కార్మికులకే లాభాల వాటా చెల్లించారని, దీంతో రానికార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లాభాలవాటా రాని కాంట్రాక్టు కార్మికులను గుర్తించి వెంటనే చెల్లించాలన్నారు. ఈ విషయంపై త్వరలోనే సీఎండీని కలుస్తామన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

భీమిని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని కేస్లాపూర్‌లో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన బాబాసాహెబ్ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజ్యాంగాన్ని రచించే స్థాయికి ఎదిగిన అంబేద్కర్ జీవితం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడమే కాకుండా వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. దేశంలోని ప్రతీ పౌరుడు స్వేచ్ఛగా జీవిస్తున్నాడంటే అది అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలమే అన్నారు. కేస్లాపూర్, చిన్నగుడిపేట గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ కొయ్యల ఏమాజీ, మాజీ ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరిలక్ష్మణ్, మాజీ జడ్పిటీసీ గంగక్క, తిరుపతి, చంద్రకుమార్, దామోదర్‌గౌడ్, పురుషోత్తంగౌడ్, సతీష్, చల్లూరి ధర్మయ్య, దుర్గం సంఘదీప్, పులగం తిరుపతి, లక్ష్మీనారాయణ, శంకరయ్య పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు


వేమనపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహించి మండలంలోని వందలాది ఎకరాల్లో పత్తి పంటలు నష్టపోయాయని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం వేమనపల్లిలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్ ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ వర్షాలకు మండలంలోని సుంపుటం, జాజులపేట, కల్లెంపల్లి, ముక్కిడిగూడెం, వేమనపల్లి, గొర్రెపల్లి, ముల్కలపేట, రాచర్ల గ్రామాల శివారులోని వందలాది ఎకరాల్లో పత్తి పంట నష్టపోయిందన్నారు. అయినా వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనా వేయలేదని తెలిపారు. ఇదే ప్రాణహిత నది బ్యాక్ వాటర్‌తో దహెగాం, పెంచికలపేట, బెజ్జూరు మండలాల్లో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిందన్నారు. కానీ వేమనపల్లి, కోటపల్లి మండలాల రైతులకు నష్టపరిహారం చేయకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. వెంటనే ప్రభుత్వం ఎకరానికి రూ. 25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌కు వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు, నాయకులు కుబిడె వెంకటేశం, కొండగొర్ల బాపు, పురాణం లక్ష్మీకాంత్, మోర్ల మొండి, బోర్కుటి సంతోష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్, కళాశాల తనిఖీ

కోటపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలను బుధవారం డీఐఈవో అంజయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని రికార్డులను పరిశీలించారు. కళాశాలకు సంబంధించి విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కళాశాల ప్రారంభమై మూడు రోజులైనా బాలికల హాస్టల్‌కు విద్యార్థులు ఇంకా చేరుకోకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే విద్యార్థులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రాబోయే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి రాణించాలన్నారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి అవగాహన, సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం సైన్స్ , గణితం బోధించే ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతమవుతున్న పోరుగడ్డ

- అధ్వానంగా జోడేఘాట్ రోడ్డు
- అటవీ అనుమతులు లేక నిలిచిన పనులు
- పూర్తి కాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- దశాబ్దాలు గడుస్తున్నా దశమారని తీరు
- నేడు కుమరం భీం వర్ధంతి



జోడేఘాట్ గ్రామం

ఆసిఫాబాద్, అక్టోబరు 16: జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో నిజాం నిరంకుశ పాలనపై పోరు సల్పిన ఆదివాసీ వీరుడు కుమరం భీం. ఆయన పుట్టిన పోరుగడ్డ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్. ప్రభుత్వం ఏటా ఆయన వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నా ఇక్కడి సమస్యలను మాత్రం ఎవరూ పరిష్కరించడం లేదు. దశాబ్దాలు గడుస్తున్నా ఆ గ్రామాల దశ మారడం లేదు. పాలకుల చిన్నచూపు, చిత్తశుద్ధి లేమి, అధికారుల నిర్లక్ష్యం పోరుగ్రామాలకు శాపంగా మారింది. ఆదివాసీల అస్తిత్వం కోసం నిజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన కుమరంభీం పోరుగడ్డకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు అధ్వానంగా మారడంతో ఏటా వర్ధంతికి వెళ్లేవారు అవస్థలు పడాల్సి వస్తోంది. అటవీ అనుమతులు రాకపోవడంతో ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణపనులు నిలిచిపోయాయి. జోడేఘాట్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.





జోడేఘాట్‌కు వెళ్లే రోడ్డు

అటవీ అనుమతులు రాక నిలిచిపోయిన పనులు..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు రూ.15 కోట్ల నిధులతో 2015లో డబుల్ రోడ్డు మంజూరైంది. జోడేఘాట్‌కు వెళ్లే మార్గంలో బాబేఝరి ఘాట్ నుంచి టోకెన్ మోవాడ్ గ్రామం వరకు సుమారు ఆరు కిలో మీటర్ల మేర డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు అటవీ అనుమతులు రాక పోవడంతో మధ్యలోనే నిలిచి పోయాయి. దశాబ్దం కావస్తున్నా ఇప్పటికీ అనుమతులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఏటా భీం వర్ధంతి సభకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. రోడ్డు కంకర తేలి రోడ్డు గతులకమయంగా అధ్వానంగా మారింది. మిగితా పనులు సైతం నాసి రకంగా ఉండడంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జోడేఘాట్ గ్రామంలో పట్నాపూర్, బాబేఝరి సమీపంలో కల్వర్టులు వర్షానికి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ నెల17న భీం వర్ధంతి సందర్భంగా నామ మాత్రంగా ఇక్కడ రోడ్డుపై మట్టివేసి పనులు చేపడుతున్నారు. ప్రతి యేటా వర్ధంతి సందర్భంగా తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అయితే రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు.

ముందుకు సాగని డబుల్ బెడ్ రూం ఇళ్లు..

జోడేఘాట్ గ్రామంలో 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం 30డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు చేసింది. ఇందులో మూడిళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 27 ఇళ్లు నిర్మాణ దశలోనే ఉన్నాయి. బాబేఝరిలో ఐదు ఇళ్లు మంజూరు చేయగా అందులో ఒక ఇల్లు పిల్లర్ దశలో ఉండగా నాలుగు ఇళ్లకు సంబంధించిన పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అధికారుల నిర్లక్ష్యంతో డబుల్ ఇళ్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. జోడేఘాట్ గ్రామంలో మొత్తం 57 కుటుంబాలు ఉండగా 30ఇళ్లు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది.



బాబేఝరిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇల్లు



భీం వర్ధంతి సందర్భంగా జోడేఘాట్ రోడ్డుపై మొరంతో మరమ్మతులు

యేటా ఇదే పరిస్థితి..

ప్రతియేటా అశ్వయుజపౌర్ణమి రోజున కుమరం భీం వర్ధంతిని జోడే ఘాట్‌లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ సారి అక్టోబరు 17న వర్ధంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తిచేస్తున్నారు. ఈ వేడుకలకు రాజకీయ ప్రముఖులతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, అస్సాం రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు తరలివస్తారు. వర్ధంతి సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంత అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఇస్తున్న హామీలు నెరవేర్చడంలో శ్రద్ధచూపడం లేదని ఆదివాసీ సంఘాలు విమర్శిస్తున్నాయి. వర్ధంతి సమయంలోనే హడావుడిచేసి ఆ తరువాత పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జోడేఘాట్‌ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.

భీం వర్ధంతిని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

కాసిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి అమరుడైన కొమురంభీం 84వ వర్ధంతిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు అన్నారు. బుధవారం దేవాపూర్‌లోని కొమురంభీం చౌరస్తా వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం నిజాం సర్కారుతో కొమురం భీం వీరోచిత పోరాటాలు చేశారన్నారు. గురువారం నిర్వహించే భీం వర్ధంతికి ఆదివాసీ నాయకులు, మహిళలు, యువకులు, ప్రజా సంఘాల నాయకులు తరలి రావాలని కోరారు. వర్ధంతికి జోడేఘాట్‌కు తరలి వెళ్తున్నామని తెలిపారు. సమావేశంలో పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, ఆత్రం జంగు పాల్గొన్నారు.

మబ్బుల్లో వి'చిత్రం'



తాండూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలంలోని రేచిని గ్రామంలో బుధవారం మబ్బుల్లో విచిత్రం ఆవిష్కృతమైంది. ఆకాశంలో శంఖం ఊదుతున్నట్లు ఒక మానవ ఆకారం కనిపించడంతో ప్రజ లు ఆసక్తిగా తిలకించారు. ఫొటోలు, వీడియోలు తీసి ఆనందించారు. ఆ ఆకారం హనుమాన్‌ను పోలి ఉన్నట్లు కొందరు భావిస్తున్నారు.

మాతా శిశు మరణాలు తగ్గించాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా శిశు మరణాలు జరుగకుండా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రమణ, పాక్సీ జిల్లా అధ్యక్షుడు స్వరూపలతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో మాతా శిశు మరణాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, పిల్లల సంక్షేమం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణుల వివరాలను నమోదు చేసుకుని వైద్య పరీక్షలు, మందులు పొందే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తక్కువ బరువుతో జన్మించిన చిన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లలకు వంద శాతం వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు అనిత, కృపాబాయి, సుధాకర్‌నాయక్, జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ కృష్ణవేణి, డీపీవో ప్రశాంతి, వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు

ఉపాధిహామీ పనుల పరిశీలన



అధికారులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

జైపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుమట్ల గ్రామపంచాయతీలో బుధవారం కేంద్రం నుంచి వచ్చిన మినిస్టర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారులు కేహెచ్ సునీల్, సీవీ బాల మురళి ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళల కోసం చేపట్టిన చర్యలు, గ్యాస్ బుక్, పింఛన్‌లు, జనాభా లెక్కలు, కేంద్రం నిధుల ద్వారా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఎస్‌హెచ్‌జీ గ్రూపు నుంచి రుణాలు పొంది ఏ విధంగా మహిళలు అభివృద్ధి చెందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులను ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు, పంచాయతీ కార్యదర్శి శ్రావణిలు ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో ఏపీవో వెంకటేశ్వర్లు, ఈసీ రాజమౌళి, టీఏ తిరుపతి పాల్గొన్నారు.

సన్నాల జోరు

- జిల్లాలో 90 శాతం సన్నరకం వరి సాగు
- క్వింటాలుకు రూ.500ల బోనస్ ప్రకటనతో పెరిగిన సాగు విస్తీర్ణం
- ధాన్యం కొనుగోళ్లకు అధికారుల ఏర్పాట్లు
- మరో 20 రోజుల్లో కోతలు ప్రారంభం



నెన్నెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం సీజన్‌లో వరి పంట అంచనాలకు మించి సాగైంది. ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు సన్నరకాల సాగుకే మొగ్గు చూపారు. ఈ సారి జిల్లాలో 90 శాతం రైతులు సన్నాలు పండిస్తున్నారు. వర్షాలు అనుకూలంగా కురువడంతో ఆయకట్టుతోపాటు పొలాల్లో సైతం నాట్లు వేసుకున్నారు. ముందుగా నాట్లు పూర్తి చేసుకున్న రైతుల పొలాలు మరో 20 రోజుల్లో కోతకు రానున్నాయి. కోతల ప్రారంభం నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సారి దొడ్డు, సన్న రకాల ధాన్యం సేకరణకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. జిల్లాలో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకు వచ్చారు. కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బి గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ2,300 ఉండగా, బోనస్ రూ.500 కలుపుకొని రూ. 2800 దక్కనుంది. రూ.500 బోనస్ రానుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

1,38,989 ఎకరాల్లో..

ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించడంతో జిల్లాలో సన్నాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 90 శాతం రైతులు సన్నాలనే సాగు చేశారు. ఈ వానాకాలం సీజన్‌లో 1,56,809 ఎకరాల్లో వరి సాగు చేశారు. 1,38,989 ఎకరాల్లో సన్నాలు సాగు కాగా, 17,820 ఎక రాల్లో మాత్రమే దొడ్డు వడ్లు సాగ య్యాయి. దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుండగా, అందులో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాలు వేశారు. 2.10 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. గత అనుభవాల దృష్ట్యా రైతులకు మార్కెటింగ్ కష్టాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మద్దతు ధరకు మించి..

గతంలో సన్నాలు పండించిన రైతులు కొనే వారు లేక ఇక్కట్లు పడేవారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నాలకు బి గ్రేడ్ ధాన్యంగా పరిగణించి దొడ్డు వడ్ల కంటే తక్కువ ధర చెల్లించేవారు. మిల్లర్లు, వ్యాపారులు సిండికెట్‌గా మారి ధరలు తగ్గించేవారు. వరికి బోనస్ ఇవ్వడంతో రైతులకు లబ్ధి చేకూరడంతోపాటు రాష్ట్ర అవసరాలు తీరుతాయని సన్నాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం సరఫరా, హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సైతం సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించారు.

పంట కాలం ఎక్కువ.. దిగుబడి తక్కువ

దొడ్డు రకాలతో పోల్చుకుంటే సన్నాల పంట కాలంతోపాటు పెట్టుబడి కూడా ఎక్కువ కాగా దిగుబడి మాత్రం తక్కువ వస్తుంది. ఫైన్, సూపర్ ఫైన్ రకాలను బట్టి 140 నుంచి 160 రోజుల పంట కాలం ఉంటుంది. గింజకట్టే వరకు సాగు నీరు అందించడంతో పాటు పంటను అహర్నిషలు చీడపీడలు, తెగుళ్ల నుంచి రక్షిచుకోవాల్సి ఉంటుంది. దొడ్డు రకాలు ఎకరానికి 40 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తే సన్నాలు మాత్రం 35 బస్తాలు చేతికి రావడం గగనమని రైతులంటున్నారు. పైరు ఎత్తు పెరగడంతో చిన్నపాటి గాలివాన వచ్చినా నేలవాలి పంట నష్టం జరగడం లాంటి ప్రతిబంధకాలను తట్టుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అయినప్పటికి ప్రస్తుత డిమాండ్ దృష్ట్యా సాగుకు మొగ్గు చూపామని, బోనస్ ప్రకటించడంతో కష్టానికి తగ్గ ఫలితం ఉంటుందని రైతులు అంటున్నారు.

326 కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదన

ధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ అందేలా అధికారులు కార్యచరణ రూపొందించారు. వరి కోతల కంటే ముందుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. డీసీఎంఎస్, పీఏసీఎస్, సెర్ప్, మార్కెటింగ్ శాఖల ద్వారా జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. దొడ్డు, సన్న రకాల సేకరణ కోసం వేర్వేరుగా సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన గన్ని సంచులు, ఎలక్ట్రానిక్ కాంటాలు, సెంటర్లలో మౌలిక సదుపాయాలు, తరలింపు కోసం లారీల కేటాయింపు, ధాన్యం నిల్వకు గోదాముల ఎంపికపై అధికారులు దృష్టి సారించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320లు, బి రకానికి రూ.2300లు చెల్లించనున్నారు. సన్నాలకు క్వింటాలుకు రూ. 500లు బోనస్‌గా ఇవ్వనున్నారు. మద్దతు ధరతో పాటు బోనస్ కలిపి చెల్లిస్తారా.. వేరుగా అందజేస్తారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.



నెన్నెల శివారులో సన్న రకం వరి సాగు చేసిన పొలం

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం సభ్యులు బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐబీ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోవడంతో భవనాల అద్దె, అధ్యాపకుల, సిబ్బంది వేతనాలు, నిర్వాహణ ఖర్చులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వంతో అనేక సార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి కళాశాలల నిరవధిక బంద్‌ను కొనసాగిస్తున్నామని, చెప్పారు. పెండింగ్ బకాయిలను విడుదల చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని తెలిపారు. ఈ ర్యాలీకి విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

రాపనపల్లి సమీపంలో చెక్‌పోస్టు ఏర్పాటు



అంతర్రాష్ట్ర వంతెన వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

కోటపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో బుధవారం పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కోటపల్లి మండలంలోని రాపనపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన అంతర్రాష్ట్ర వంతెన వద్ద ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ప్రారంభించారు. కాగా ఇటువైపు నుంచి మహారాష్ట్రకు, మహారాష్ట్ర నుంచి ఇటు వైపు వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పక్క రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని, ఇక్కడ 24 గంటల పాటు వాహనాల తనిఖీలు ఉంటాయన్నారు.


సీపీఎస్‌ను రద్దు చేయాలి

టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి



కేంద్ర సంఘం నేతలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి డిమాండ్ చేశారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్‌లను జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ సీపీఎస్ వ్యవస్థను రద్దు చేసి పాత పెన్షన్ వ్యవస్థ (ఓపీఎస్)ను అమలు చేయాలని, 317 జీవో బాధితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ఇవ్వాలని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. ఆయన వెంట ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ ఉన్నారు.



న్యూస్ బాక్స్

సీఐల బదిలీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పట్టణ సీఐ ఆర్.బన్సీలాల్, శ్రీరాంపూర్ సీఐ దెబ్బెట మోహన్‌లు బదిలీ అయ్యారు. వారిని హైదరాబాద్ మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ బుధవారం పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులను వెలువరించారు. రామగుండం ఐటీ సెల్ విభాగంలో సీఐగా పనిచేస్తున్న ఎస్.ప్రమోద్‌రావును మంచిర్యాలకు, రాజన్న సిరిసిల్ల జిల్లా సీసీఎస్ విభాగంలో సీఐగా పనిచేస్తున్న డి.వేణుచందర్‌ను శ్రీరాంపూర్‌కు బదిలీ చేశారు.

ఫెర్టిలైజర్ డీలర్ల వివరాలు నమోదు

హాజీపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుడిపేటలోని రైతు వేదికలో బుధవారం మంచిర్యాల డివిజన్ పరిధిలోని ఫెర్టిలైజర్ డీలర్‌ల వివరాలను కేంద్ర ప్రభుత ఎంఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో మండల వ్యవసాయాధికారులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, మండల వ్యవసాయాధికారులు కృష్ణ, మహేందర్, అంజిత్, శ్రీకాంత్, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందజేత

కోటపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గత విద్యా సంవత్సరం పదోతరగతిలో 10 జీపీఏ సాధించి బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైన పుట్ట హన్సిక అనే విద్యార్థినికి బుధవారం ఉపాధ్యాయులు నగదు ప్రోత్సా హం అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆందోళన బాట


జిల్లా కేంద్రంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాలల మూసివేత
- మూడేళ్లుగా విడుదల కాని నిధులు
- ఇబ్బందుల్లో కళాశాలల యాజమాన్యాలు
- జిల్లాలో కోట్లాది రూపాయలు పెండింగ్
- విద్యార్థులకు తప్పని అవస్థలు

మంచిర్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన ప్రైవేటు కళాశాలలు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో ఆందోళన బాటపట్టారు. ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ నిరవధి కంగా కళాశాలలను మూసివేశాయి. ప్రభుత్వం అంద జేసే ఫీజు రీయింబర్స్ మెంట్‌పైనే ఆధారపడి ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు అర్హతగల విద్యార్థులకు ఉచిత విద్యాబోధన చేస్తున్నాయి. ఇందుకుగాను బోధనకు అయ్యే ఖర్చులన్నీ యాజమాన్యాలు అప్పో, సప్పోచేసి భరిస్తున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తే చేసిన అప్పులతోపాటు తమ ఖర్చులకూ ఇబ్బందులు ఉండవని భావిస్తూ సంవత్సరాల తరబడి వేచి చూస్తున్నాయి. మూడేళ్లుగా ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయకపోవడం, కళాశాలల నిర్వహణతలకు మించిన భారం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో యాజమాన్యాలు రోడ్డెక్కాయి.

● కష్ట సాధ్యంగా నిర్వహణ..

మూడేళ్లుగా బకాయిలన్నీ పేరుకుపోయినప్పటికీ ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో అధ్యాపకుల వేతనాలు చెల్లించి, కళాశాలలు నడిపించడం కష్టంగా మారిందని ప్రైవేట్ యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బస్సులు నడపాల్సి రావడంతో నిత్యం మెయింటనెన్స్ కింద ఖర్చులు వేలల్లో భరించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నాయి. బకాయిల్లో సగ భాగం నిధులు విడుదల అయినట్లు పేర్కొని ఏడాది కావస్తున్నా విద్యార్థుల ఖాతాల్లో మాత్రం ఆ నగదు జమ కాలేదు. దీంతో విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారు.

● మూసివేతకు గురవుతున్న కళాశాలలు..

జిల్లాలో ఒకప్పుడు 14 డిగ్రీ, 14 జూనియర్ కళాశాలలు ఉంటే... ప్రస్తుతం 5 చొప్పున మిగిలాయి. నిర్వహణ భారమై ప్రతియేటా కళాశాలలు మూసివేతకు గురవుతున్నాయి. దీనికి కారణం ఫీజురీయింబర్స్ మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవ డమే. ప్రభుత్వ కళాశాల్లో డేటా సైన్స్, ఫుడ్ సైన్స్, డైరీ సైన్స్, బీబీఏ తదితర కోర్సులు అందుబాటులో లేవు. ప్రైవేటులో మాత్రమే ఉన్నాయి. విద్యార్థులు కళాశాలకు రావాలంటే బస్సులు నడపక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. నిర్వహణ భారంతో కళాశాలలు ఎత్తివేస్తుండటంతో విద్యార్థులు ఆ విభాగాల్లోని విద్యకు దూరమవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఒక్కొక్కటిగా కళాశాలలు మూసివేతకు గురై విద్యార్థులు ఉన్నతవిద్య కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ నిధుల చెల్లింపుపై దృష్టిసారించి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

● రూ. 45 కోట్ల మేర బకాయిలు..

జిల్లాలో 2020-21నుంచి 2023-24వరకు మూడు సంవత్సరాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ విద్యార్థులు మొత్తం 20వేల వరకు ఉండగా, ఫీజు రీయంబర్స్ మెంట్, ఉపకార వేతనాలు కలిపి రూ. 40కోట్ల నుంచి రూ. 45కోట్లవరకు బకాయిలు పేరుకుపోయాయి. బీసీ సంక్షేమశాఖలో ఎంటీఎఫ్ (స్టూడెంట్‌మెయింటనెన్స్) రూ.3.50 కోట్ల బకాయిలుఉండగా, ఆర్టీఎఫ్ (ఫీజు రీయంబర్స్‌మెంట్) రూ. 20.50 కోట్లు పెండింగులో ఉన్నాయి. ఈ బకాయిలు ఇలా ఉండగానే కొత్తగా చేరుతున్న విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. అలాగే ఈబీసీ డిపార్టుమెంట్ ఆర్టీఎఫ్ రూ.2.50 కోట్లు బకాయిలు ఉండగా, మైనారిటీ కేటగిరీ కింద ఎంటీఎఫ్ రూ. 1.30 కోట్లు, ఆర్టీఎఫ్ రూ.3.90 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఎస్సీ సంక్షేమ శాఖలో ఎంటీఎఫ్ రూ. 2.20 కోట్లు ఉండగా, ఆర్టీఎఫ్ రనూ. 3.70కోట్ల బకాయిలు ఉన్నాయి. అలాగే ఎస్టీ సంక్షేమశాఖ ద్వారా 5.85 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయి. మొత్తం బకాయిల్లో దాదాపు రూ.15 కోట్లకు ప్రొసీడింగ్స్‌తోపాటు 10నెలల క్రితం టోకెన్ నెంబర్లు ఇచ్చినప్పటికీ ట్రెజరీల్లో పెండింగులో ఉన్నట్లు చూపిస్తుండటం గమనార్హం. అవి విద్యార్థుల ఖాతాల్లో జమ కాకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. మిగతా రూ. 20 నుంచి 25 కోట్లు ఇంతవరకు బడ్జెట్ కేటాయించలేదు.

ప్రభుత్వం స్పందించాలి...

పభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. ఫీజు రీయంబర్స్ మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయడం ద్వారా కళాశాలలను కాపాడాలి. కళాశాలలు మూసివేతకు గురైతే విద్యార్థులు నష్టపోవడంతో పాటు వాటిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారంతా ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం.

- నర్సయ్య, తెలంగాణ ప్రైవేటు డిగ్రీ మేనేజిమెంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ సంఘం నాయకులు

బీసీలు ఐక్యంగా ఉండాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారంతోనే బీసీల హక్కులు, అభివృద్ధి సాధ్యమని, ఇందుకోసం బీసీలంతా ఐక్యంగా పోరాడాలని మందమర్రి బీసీ సంఘం గౌరవాధ్యక్షుడు పోలు శ్రీనివాస్, అధ్యక్షుడు శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బీసీ కులగణనకు శ్రీకారం చుట్టినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాహుల్‌గాంధీ జోడోయాత్రలో కుల గణన ప్రక్రియ ప్రారంభిస్తారని చెప్పారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గణన ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 54శాతం బీసీలు ఉంటే తక్కువ ఉన్న కులాల ఆధిపత్యం కొనసాగుతుందన్నారు. బీసీల హక్కుల సాధనకోసం త్వరలో జిల్లాలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సోజీ, కడారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల పాదయాత్ర


యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌కు చెందిన ఇద్దరు అయ్యప్ప భక్తులు బుధవారం శబరిలైకి పాదయాత్రగా బయలు దేరారు. ఖమ్మం ఐలయ్య, బోడ రామకృష్ణలు అయ్యప్ప మాల ధరించి భక్తాంజనేయ స్వామి ఆలయం నుంచి మహాపాదయాత్ర చేపట్టగా అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్ రావు, నరహరి శర్మ గురుస్వామి, టీబీజేకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీఏపీ జిల్లా కార్యదర్శి సిరిపురం రాజేశం, ఆలయ కమిటీ చైర్మన్ మల్లెత్తుల రాజేంద్రపాణి, ఏబీఏపీ జిల్లా అధికార ప్రతినిధి భాస్కర్ల రాజేశం, శ్రీరాంపూర్ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాదు వీరభద్రస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన వారందరు ఓటరుగా నమోదు చేసుకో వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెబరెల్లి రఘునాథ్ అన్నారు. బుధవారం మంచిర్యాల గ్రీన్ సిటీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలోని క్రీడాకారులను, పల్లవి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులను కలిసి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు కోసం తమ కార్యాలయం 9160603222నంబరులో సంప్రదిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, సతీష్‌రావు, అశ్విన్ పాల్గొన్నారు.


కుమరం భీం జిల్లా జోడేఘాట్‌లోని జల్, జంగల్, జమీన్ ఆర్చీ

సమస్యలతో సతమతమవుతున్న పోరు గడ్డ..

- అధ్వానంగా జోడేఘాట్ రోడ్డు
- అటవీ అనుమతులు లేక నిలిచిన పనులు
- పూర్తి కాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- దళాబ్దాలు గడుస్తున్నా దశమారని తీరు

7

వృథాగా సాగునీరు

దండేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంధ్రకాలనీ సమీపంలో 28వ డిస్ట్రిబ్యూటరీ వద్ద కాలవనీరు రోడ్డుపైకి చేరింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. డిస్ట్రిబ్యూటరీ కాలువలో చెత్తాచెదారం తట్టుకోవడంతోనే ఇలా రోడ్డుపైకి నీరు చేరింది. దీంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడ్డారు. అధికారులకు సమాచారం అందించడంతో కాలువలో నీటి ప్రవాహన్ని తగ్గించారు. అధికారులు కాలువ లో చెత్తాచెదారం తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


రాష్ట్రీయ రహదారిపై పారుతున్న నీరు

పట్టణ అభివృద్ధికి కృషి

బెల్లంపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. బుధవారం 10,11,20,28 వార్డుల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నెల్లి రమేష్, కె. చంద్రశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓరియంట్ ప్రభావిత గ్రామాలను అభివృద్ధి చేస్తాం

కాసిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓరియంట్ సిమెంట్ కంపెనీ ప్రభావిత గ్రామాలను దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ అన్నారు. బుధవారం గట్రావుపల్లి పంచాయతీలోని సాలెగూడంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ రూ. 33 లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాలును ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్య, వైద్యం, రహదారి సౌకర్యాలను మెరుగు పర్చడంతో పాటు అర్హులైన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా కల్పించారు. కంపెనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కమ్యూనిటీ హాలును ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం స్థలాన్ని ఉచితంగా అందించిన గ్రామ పటేల్ జైతును అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు రాజు, గణపతి, హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి, ఏజీఎం ఉమాశంకర్, పాల్గొన్నారు.

సైన్స్ కేంద్రంలో కళా ఉత్సవ పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో బుధవారం జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ కె చౌదరి మాట్లాడుతూ తక్కువ సమయంలో విద్యార్థులను పోటీలకు సిద్ధం చేసిన గైడ్ టీచర్లు, పోటీలకు పంపించిన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను అభినందించారు. న్యాయనిర్ణేతలుగా ఆర్కే ప్రసాద్, భూపతి సంతోష్ కుమార్, సునిత, భూపతి నారాయణ రావు, కరుణాకర్, శాంకరి, సుహాసిని, అర్జున్, లక్ష్మణ్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో పోటీల సమన్వయకర్త సత్యానారాయణమూర్తి విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సామాజిక కార్యకర్త మృతి

కాసిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ముత్యంపల్లికి చెందిన సామాజిక కార్యకర్త సయ్యద్ రషీద్ (39) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. రషీద్ సామాజిక కార్యక్రమాలతో పాటు రక్తదానంపై అవగాహన కల్పించారు. 30 సార్లు ఆయన రక్తదానం చేశారు.

కేంద్రం బృందం పర్యటన


రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

హాజీపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ లెవెల్ మానిటర్ బృందం సభ్యులు బుధవారం మండలంలోని వేంపల్లి గ్రామపంచాయతీలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల ద్వారా నడుస్తున్న పథకాలు వాటి అమలు విధానంపై తనిఖీ చేశారు. ఉపాధిహామీ పథకం, పింఛన్‌లు, మహిళ సంఘాలు చేపట్టిన పనులు, రోడ్లు, పంచాయతీ నిధుల ద్వారా చేస్తున్న పనులు, రికార్డులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, నోడల్ ఆఫీసర్ సదానందం, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో ఉమర్ షారిఫ్, ఏపీవో మల్లయ్య , ఈసీ శ్రీనివాస్, టీఏ వేణు, ఎఫ్ఏ స్వర్ణ, పీఎస్ ప్రతిభ, ఏపీఎం రాజన్న పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరేందర్



భీమారం, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుడిమల్ల నరేందర్ నియ మితుల య్యారు. ఈనెల 7,8 తేదీల్లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో నరేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, దామోదర్ రెడ్డిలు నియామక పత్రం అందజేశారు.

బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం

దండేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): బదిలీపై వెళ్తున్న లైన్‌మెన్ రామస్వామి, అసిస్టెంట్ లైన్‌మెన్ రాజ లింగును బుధవారం ఎంపీటీసీ ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌తో పాటు నాయకులు, రైతులు సత్కారించారు. ఇక్కడ స్థానికులు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ బదిలీ

తాండూర్, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి) : తాండూర్ విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ బదిలీపై క్యాతనపల్లికి వెళ్లారు. అలాగే మంచిర్యాల టౌన్‌లో పనిచేస్తున్న జోహెన్ తాండూర్ మండలానికి బదిలీపై వచ్చారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళా శాల ప్రిన్సిపాల్ శంకర్‌ను బుధవారం హైదరాబాద్‌లో జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్ సన్మానించారు. డిగ్రీ కళాశాలలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చేపట్టిన కార్యక్రమాలు అభినం దనీయమని కొనియాడారు.

బతుకమ్మ చీరలు రాక

కాసిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మచీరలు బుధవారం ఉదయం మండల కేంద్రానికి చేరుకున్నాయి. తెలంగాణలో ఆడపడుచులు నిర్వహించుకునే పండగ బతుకమ్మకు ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తుంది. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బతుకమ్మ చీరల పంపిణీ చేయడంలో జాప్యం చేసింది. బతుకమ్మ పండగ ముగిసిన అనంతరం బతుకమ్మ చీరలు రావడం పట్ల మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలానికి 10,770 చీరలు వచ్చాయి. వీటిని స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు గురువారం నుంచి అందజేస్తామని ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం వెంకటేష్ తెలిపారు

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

బెల్లంపల్లి,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024లో ఉత్తీర్ణులై అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న 230 మంది ఉపాధ్యాయులు జిల్లా వ్యాప్తంగా బుధవారం విధుల్లో చేరారు. ప్రతీ ఉపాధ్యాయుడికి తొలి పోస్టింగ్ విశేషంతో కూడుకున్నది. వారు పనిచేసిన మొట్టమొదటి ప్రాంతం ఓ జ్ఞాపకంగా మిగిలిపోనుంది. విధులు చేపట్టేముందు కొత్త ఉపాధ్యాయులు ఉద యం దేవాలయాలకు వెళ్లి అపాయింట్‌మెంట్ ఆర్డర్లకు అర్చకులతో పూజలు చేయించారు. తల్లిదండ్రులు, కుటుంబీకుల ఆశీర్వాదం తీసుకుని పాఠశాలలకు చేరుకున్నారు. సంబంధిత పాఠశాలలో హెడ్మాస్టర్, మండల విద్యాధికారులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అంద జేసి రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పలువురు కొత్త ఉపాధ్యాయులు ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.


ఎంఈవోకు పోస్టింగ్ ఆర్డరు కాపీ అందజేస్తున్న కొత్త ఉపాధ్యాయులు

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తా..



విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తాం. డీఎస్సీలో పదో ర్యాంకు సాధించి ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యాను. నాకు నస్పూర్ మండలంలోని సంగమల్ల య్యపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది. విద్యార్థులకు మొదటి రోజు పాఠాలు బోధించడం మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది.

- ఉప్పు స్రవంతి , ఉపాధ్యాయురాలు

జీవితంలో మర్చిపోలేని రోజు..



తొలి రోజు విద్యార్థులకు పాఠాలు బోధించడం సంతోషంగా అనిపించింది. చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయురాలు కావాలనే ఆశతో కష్టపడి చదివాను. విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను బోధిస్తాను. జీవితంలో స్థిరపడాలంటే విద్యార్థి దశ అనేది కీలకమైనది.

- మౌనిక, ఉపాధ్యాయురాలు, బెల్లంపల్లి

రేపు అండర్-17 క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య (మంచిర్యాల) ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-17 ఎస్‌జీఎఫ్ బాల బాలికల క్రికెట్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్ యాదయ్య ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరి సిహెచ్ ఫణిరాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01.01.2008 తర్వాత జన్మించి 6వతరగతి, ఆ పైతరగతులు చదువుతూ 12వ తరగతి లోపు ఉన్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పాఠశాల నుంచి బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్ ప్రతులు తీసుకొని రావాలని సూచించారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు మాత్రమే అవకాశం ఉంటుందని, క్రీడాకారులు తమ సొంత క్రికెట్ కిట్‌తో రావాలని తెలిపారు. పూర్తి వివరాలతో కోచ్ ప్రదీప్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆసుపత్రిలో అన్నదానం

గర్మిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గోదావరి రోడ్డులోని మాతాశిశు సంరక్షణ కేంద్రం ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ లయన్ మెంబర్ మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ మంచిర్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 300 రోజుల నుంచి ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాల మోహన్, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, హన్మంతరావు పాల్గొన్నారు.